కాళేశ్వరం రీడిజైన్ సబబే

- ప్రాణహిత కంటే పెరిగిన ఆయకట్టు, నీటి నిల్వ సామర్థ్యం
- నీటి లభ్యత, మహారాష్ట్ర అభ్యంతరాలు
- సీడబ్ల్యూసీ సూచన మేరకే మార్పులు
- పీపీటీ ద్వారా ఉన్నతాధికారుల స్పష్టం
- కాళేశ్వరంతో 17లక్షల ఎకరాల స్థిరీకరణ
- ఇప్పటికే 98 వేల ఎకరాల కొత్త ఆయకట్టు
- 2029 నాటికి పూర్తి ఆయకట్టుకు నీరు
- పునాది పరీక్షల తర్వాతే వాస్తవాలు
- ఆ తర్వాతే బరాజ్ పునరుద్ధరణ చర్యలు
- ఏజెన్సీలతో కాఫర్ డ్యామ్ పనులు
- మంత్రులతో ఈఎన్సీ మురళీధర్

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి' ఎత్తిపోతల పథకాన్ని తెలంగాణ ఏర్పడిన తర్వాత కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుగా రీడిజైన్ చేయడం పూర్తిగా సబబేనని ఇరిగేషన్ ఉన్నతాధికారులు తేల్చిచెప్పారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ప్రతిపాదించిన చోట ఆశించిన స్థాయిలో నీటిలభ్యత లేకపోవడం, మహారాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలు, సీడబ్ల్యూసీ నిర్దేశిత మార్గదర్శకాల మేరకే పీసీఎస్ఎస్ ప్రాజెక్టును మార్చినట్టు వెల్లడించారు. రీడిజైన్ ద్వారా అదనంగా ఆయకట్టు రావడంతోపాటు నీటి నిల్వసామర్థ్యం కూడా పెరిగిందని, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాను పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని ప్రభుత్వానికి నివేదించారు. మేడిగడ్డ బరాజ్లోని పలు పియర్లు కుంగిన నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి నేతృత్వంలో మంత్రుల బృందం ప్రాజెక్టును సందర్శించింది. మంత్రుల బృందానికి ప్రాజెక్టు వివరాలను తెలియజేసేందుకు ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీటీ)ని రూపొందించారు. దానిని సాగునీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్ మంత్రులకు వివరించారు.

నీటిలభ్యత లేకపోవడం వల్లే రీడిజైన్

ప్రాణహిత నుంచి 160 టీఎంసీల నీటిని ఎల్లంపల్లి రిజర్వాయర్కు తరలించి 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.17,875 కోట్ల అంచనాలతో ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి 2007 మే 16న జీవో 124 ద్వారా పరిపాలన అనుమతులు జారీ చేశారని మురళీధర్ గుర్తుచేశారు. ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ప్రాజెక్టు అంచనాలను రూ.38,500 కోట్లకు పెంచుతూ 2008 డిసెంబర్ 17న జీవో 238 రూపంలో సవరించిన పరిపాలన అనుమతులు జారీచేశారని తెలిపారు. ప్రాజెక్టు విద్యుత్తు అవసరాలు 3,466 మెగావాట్లు కాగా, ఏటా 8,701 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరమని అంచనా వేశారని పీపీటీలో పొందుపరిచారు. ఈ ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో 5.09 టీఎంసీల సామర్థ్యంతో బరాజ్ను ప్రతిపాదించారు. దీనివల్ల మహారాష్ట్ర పరిధిలో 3,786 ఎకరాల ముంపు ఉండటంతో ఆ రాష్ట్రం ఈ ప్రాజెక్టుపై అభ్యంతరం తెలిపి, బరాజ్ ఎత్తును 148 మీటర్లకు తగ్గించాలని పట్టుబట్టిందని నివేదించారు. '148 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే నీటి నిల్వ సామర్థ్యం 1.85 టీఎంసీలకు తగ్గిపోతుంది. కేంద్ర జలసంఘం అంచనాల ప్రకారం తుమ్మిడిహట్టి వద్ద 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా నీటి లభ్యత 165.38 టీఎంసీలు మాత్రమే. అందులో 63 టీఎంసీలు ఎగువ రాష్ట్రాలు వాడుకోని మిగులు జలాలు. భవిష్యత్తులోఅవి వాడుకుంటే నికరంగా లభ్యమయ్యేది 102 టీఎంసీలే. అదీగాక 148 ఎఫ్ఆర్ఎల్ బరాజ్ను నిర్మిస్తే 102 టీఎంసీల్లోనూ 44 టీఎంసీలను మాత్రమే తరలించే అవకాశముంటుంది. ఈ నేపథ్యంలో నీటి నిల్వల కోసం ప్రత్యామ్నాయాలను చూడాలని సీడబ్ల్యూసీ సూచించింది. నీటి నిల్వసామర్థ్యం కూడా 14 టీఎంసీలు మాత్రమే ఉన్నదని, దానిని పెంచుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వ్యాప్కోస్ ద్వారా అధ్యయనం చేస్తే మేడిగడ్డ వద్ద 22.3 టీఎంసీల లభ్యత ఉన్నదని తేలింది. దీని వల్లే పీసీఎస్ఎస్ను కాళేశ్వరం ప్రాజెక్టుగా రీడిజైన్ చేయాల్సి వచ్చింది. రిజర్వాయర్ల సామర్థ్యం కూడా పెంచాం' అని వివరించారు.

17 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ

కాళేశ్వరం ద్వారా 215 టీఎంసీల గోదావరి జలాలను తరలించి రూ.19.63 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 1.82 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరించాలని ప్రతిపాదించగా, ఇప్పటివరకు కొత్తగా 98,570 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని ఈఎన్సీ మురళీధర్ తెలిపారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు ప్రధాన కాల్వల ద్వారానే 456 చెరువులు నింపాం. వాటికింద 39,146 ఎకరాల ఆయకట్టు ఉన్నది. కాళేశ్వరం నీళ్లను ఎస్సారెస్పీ-1,2, నిజాంసాగర్ కాల్వల ద్వారా 2,143 చెరువులకు తరలించాం. వాటికింద మరో 1,67,050 ఎకరాల ఆయకట్టు ఉన్నది. దిగువ మానేరు కింద ఎస్సారెస్పీ స్టేజీ-1కి సంబంధించిన పాత ఆయకట్టుతో పాటు ఎస్సారెస్పీ స్టేజీ-2, నిజాంసాగర్ కింద 17,08,230 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాం. 2020-21 యాసంగి నుంచి 2023-24 వానకాలం వరకు కూడవల్లి వాగు, హల్దివాగు, 66 చెక్ డ్యామ్ల కింద ఉన్న మొత్తం 20,576 ఎకరాలకు కాళేశ్వరం జలాలను విడుదల చేస్తున్నాం. 2029 నాటికి ప్రాజెక్టు కింద ప్రతిపాదిత ఆయకట్టుకు సాగునీరందించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశాం. అందుకు సంబంధించి టెండర్లు పూర్తికావడంతో కొన్ని చోట్ల పనులు ప్రారంభమయ్యాయి' అని వివరించారు.

పునాది పరిశీలన తరువాతే పునరుద్ధరణ

ఈ ఏడాది అక్టోబర్ 21న సాయంత్రం మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్లోని 20వ నంబర్ పియర్ కుంగడంతో బరాజ్పై ఉన్న బ్రిడ్జి స్లాబ్ కుంగింది. దానిపక్కనే ఉన్న 19, 21 నంబర్ పియర్లు కూడా కుంగాయని ఈఎన్సీ తెలిపారు. 'అక్టోబర్ 22న ఎల్అండ్టీ జీఎం సురేశ్కుమార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం బరాజ్ను సందర్శించిందని, బరాజ్ని తామే పునరుద్ధరిస్తామని తెలిపింది. అదే రోజు సీడీవో, సీఈ నేతృత్వంలో టెక్నికల్ టీమ్ బరాజ్ను సందర్శించి కుంగుబాటుకు కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేసింది. అక్టోబర్ 24న ఆరుగురు సభ్యుల నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం బరాజ్లోని 20వ నంబర్ పియర్ 1.256 మీటర్లు కుంగినట్టు గుర్తించింది. 28వ తేదీన డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ చైర్మన్ అశ్విన్ బీ పాండ్యా నేతృత్వంలోని టీమ్ బరాజ్ను సందర్శించింది. నవంబర్ ఒకటిన ఎన్డీఎస్ఏ టీమ్ బ్యారేజీ కుంగుబాటుపై నివేదిక ఇచ్చింది. పిల్లర్ల కుంగుబాటుకు ప్లానింగ్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్లోని లోటుపాట్లే కారణమని ఎన్డీఎస్ఏ నివేదికలో పేర్కొన్నది. నీటిని పూర్తిగా తొలగించిన తర్వాతే కుంగుబాటుకు కారణాలు నిర్ధారించగలమని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. ఇందుకోసం కాఫర్ డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభించాం.. అవసరమైతే బరాజ్లోని 7 బ్లాక్ పియర్ల తొలగింపునకు వినియోగించాల్సిన టెక్నాలజీపైనా కసరత్తు చేస్తున్నాం. వీలైనంత త్వరగా బరాజ్ పునరుద్ధరణ చేపడుతాం' అని వివరించారు.

కాళేశ్వరం అప్పు రూ.87,449.16 కోట్లు

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం (అదనపు టీఎంసీని కలుపుకొని) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కన్సార్షియం, బ్యాంక్ ఆఫ్ బరోడా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డ్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ నుంచి రూ.87,449.16 కోట్ల అప్పు మంజూరవ్వగా.. రూ.71,565.69 కోట్లు ప్రభుత్వం తీసుకొన్నది. ఇంకా ఆర్థిక సంస్థల నుంచి రూ.15,698.91 కోట్లు విడుదల కావాల్సి ఉన్నది. తీసుకున్న లోన్ల నుంచి ఇప్పటివరకు రూ.4,696.33 కోట్ల అసలు రీపేమెంట్ చేశారు. ఐదేండ్లలో తెచ్చిన అప్పులకు వడ్డీ రుపంలో రూ.16,201.94 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. మొత్తం రూ.21,157.87 కోట్లు తిరిగి చెల్లించారు. కాళేశ్వరం కార్పొరేషన్లో భాగమైన పాలమూరు రంగారెడ్డికి రూ.10 వేల కోట్ల లోన్ మంజూరు కాగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.7,721.51 కోట్లు విడుదలచేసింది. ఇంకా 2,278.49 కోట్లు విడుదల కావాల్సి ఉన్నది. ప్రాజెక్టు కుతీసుకున్న అప్పులకు మూడేండ్లలో రూ.1,522.8 కోట్ల వడ్డీ చెల్లించారు. ఈ అప్పులకు సంబంధించి అసలు చెల్లింపులు ఇంకా మొదలు కాలేదు.

కాళేశ్వరం ఆయకట్టు వివరాలు (ఎకరాలలో)

ప్రతిపాదించిన ఆయకట్టు	సృష్టించిన ఆయకట్టు
19,63,360	98,570

ఇంకా సృష్టించాల్సిన మిగులు ఆయకట్టు: 18,64,790

మిగులు ఆయకట్టుకు సాగునీటి సరఫరా ప్రణాళిక



ప్రాజెక్టు అంచనా వ్యయం, ఖర్చు వివరాలు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	అంచనా వ్యయం	కాళేశ్వరం కార్పొరేషన్	రాష్ట్ర ప్రభుత్వం	మొత్తం జరిగిన వ్యయం
2 టీఎంసీల ప్రాజెక్టు	94,413.27	44,614.06	28,885.93	73,499.99
మూడో టీఎంసీ	33,459.01	17,051.14	3,320.93	20,372.07
మొత్తం	1,27,872.28	61,665.2	32,206.87	93,872.07

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అంచనా వ్యయం, చేసిన ఖర్చు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు ఒప్పందం విలువ	36,257.83
2014 నాటికి చేసిన వ్యయం	6,156.92
2014-16 మధ్య జరిగిన వ్యయం (ఈఇంజినీరింగ్కు పూర్వం)	5,522.79
మొత్తం వ్యయం 2016 నాటికి	11,679.71

లోకం పోకడ



నేనూ కోల్డ్వార్ బాధితుడినే సార్.. అంటే, జలుబుతో పోరాడుతున్నా!

గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్లో డైరక్టర్ చిన్నంరెడ్డిని సస్పెండ్ చేయాలంటూ ప్లకార్డులతో ఉద్యోగుల ఆందోళన

నిథమ్ డైరెక్టర్ను తొలగించాలి

- రూ.13 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు
- సంస్థను మూతపడే స్థితికి తీసుకొచ్చారు
- చిన్నంరెడ్డిని బర్తరఫ్ చేయాల్సిందే
- ప్లకార్డులతో ఉద్యోగుల ఆందోళన
- ఆరోపణలు కొట్టిపడేసిన చిన్నంరెడ్డి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 29: గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ (నిథమ్) డైరెక్టర్ శేరి చిన్నంరెడ్డి రూ.13 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ టీచింగ్, నాన్టీచింగ్ ఉద్యోగులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తన వ్యవహారశైలితో సంస్థను మూతపడే స్థితికి తీసుకొచ్చిన ఆయనను బర్తరఫ్ చేయాలని, న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా క్యాంపస్లో మీడియాతో వారు మాట్లాడుతూ.. 2016లో నిథమ్కు కొత్త డైరెక్టర్గా నియమితులైన చిన్నంరెడ్డి అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏ వర్సిటీ వీసీకి లేనంత వేతనం అందుకుంటున్నారని, నెలకు రూ.3.30 లక్షల వేతనంతోపాటు అలవెన్సు కింద మరో లక్ష తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత నిథమ్ వెనకబడిపోయిందని.. ఒకప్పుడు 950 మంది విద్యార్థులు ఉండగా, నేడు ఆ సంఖ్య 250కి పడిపోయిందని తెలిపారు. నిథమ్లో మొత్తంగా రూ.50కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. కాగ్ సైతం రూ.13కోట్ల అక్రమాలు జరిగినట్టు నివేదికలో పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. చిన్నంరెడ్డి అక్రమాలపై పర్యాటకశాఖ మంత్రి, కార్యదర్శికి ఇటీవల ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నిథమ్ రిజిస్ట్రార్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మహేందర్రెడ్డి, డాక్టర్ కిరణ్మయి, ఫైనాన్స్ ఆఫీసర్ శేషయ్య, లైబ్రేరియన్ యాదగిరి, ఎస్టాబ్లిష్మెంట్ అధికారి హనుమంతురావు సహా పలువురు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు: చిన్నంరెడ్డి

ఉద్యోగుల ఆరోపణల్లో వాస్తవం లేదని, ఎలాంటి అక్రమాలు జరగలేదని నిథమ్ డైరెక్టర్ చిన్నంరెడ్డి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఉద్యోగులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నిథమ్కు సంబంధించి గవర్నింగ్ కౌన్సిల్ బోర్డు నిర్ణయాలు తీసుకుంటుందని, తన ఒక్కడి నిర్ణయంతో ఏదీ సాధ్యం కాదని స్పష్టం చేశారు.

నకిలీ ఔషధాల ముఠా అరెస్టు

- ప్రముఖ బ్రాండ్ల పేరిట విక్రయం
- రూ.26 లక్షల విలువైన ఔషధాలు సీజ్

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): బ్రాండెడ్ మందులను పోలిన నకిలీ ఔషధాలను మార్కెట్లో విక్రయిస్తున్న ముఠాను రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.26 లక్షల విలువైన నకిలీ ఔషధాను స్వాధీనం చేసుకున్నారు. డీసీఏ డీజీ కమలాసన్రెడ్డి వివరాల ప్రకారం.. ఉత్తరాఖండ్ నుంచి నకిలీ ఔషధాలు రవాణా అవుతున్నట్టు డీసీఏ అధికారులకు సమాచారం అందింది. హనుమకొండ డ్రగ్స్ ఇన్స్పెక్టర్ జే కిరణ్ దర్యాప్తు జరిపి, శుక్రవారం డీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ అంజూం ఆబిదా, ఇన్స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, రవికుమార్, అనిల్, క్రాంతికుమార్, రాజు, నాగరాజుతో పలుచోట్ల దాడులు చేశారు. ఉత్తరాఖండ్లోని కాశీపూర్ నుంచి 'ట్రాక్ ఆన్ కొరియర్స్' వాహనంలో దిల్సుఖ్నగర్కు రెండు పార్సిల్స్ వచ్చినట్టు గుర్తించారు. వాటిపై యంత్రాల విడిభాగాలు అని రాసి ఉన్నా, లోపల మాత్రం దాదాపు 18 కిలోల నకిలీ ఔషధాలు ఉన్నట్టు నిర్ధారించారు. వీటిని తెప్పించిన పువ్వాడ లక్ష్మణ్ అదుపులోకి తీసుకున్నారు. ద్వారకాపురంలో అతడు నిర్వహిస్తున్న గోదాములో తనిఖీలు చేయగా, పెద్ద ఎత్తున నకిలీ ఔషధాలు దొరికాయి. ఎనిమిది రకాల కంపెనీల పేర్లతో వీటిని తయారు చేసినట్టు గుర్తించారు. లక్ష్మణ్కు సాయం చేసిన సైదాబాద్కు చెందిన పోకల రమేశ్, గారపల్లి పూర్ణచందర్ను అరెస్ట్ చేశారు. నిందితులు ఇండ్లల్లో సోదాలు నిర్వహించారు. ఉత్తరాఖండ్లో నదీమ్ అనే వ్యక్తి ఈ నకిలీ ఔషధాలను తయారు చేస్తున్నట్టు తెలుసుకొని, అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. నిందితులు నకిలీ ఔషధాలు తయారు చేసి సన్ ఫార్మా, గ్లెన్మార్క్ ఫార్మా, అరిస్టో ఫార్మా, టొరెంట్ ఫార్మా వంటి ప్రముఖ కంపెనీల పేర్లతో లేబుల్ వేసినట్టు గుర్తించారు. దీంతోపాటు ఎంపీవోడీ-200, మెక్స్క్లావ్-625 పేర్లతో రెండు రకాల యాంటీ బయాటిక్స్ను మార్కెట్లో విక్రయిస్తున్నట్టు గుర్తించారు. హిమాచల్ప్రదేశ్కు చెందిన 'మెగ్ లైఫ్ సైన్సెస్'గా పేర్కొన్నారని, అదొక నకిలీ కంపెనీ అని చెప్పారు. ఈ ఔషధాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తుమ్మిడిహట్టిని నిర్మిస్తాం

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కొనసాగిస్తాం.. మేడిగడ్డపై న్యాయవిచారణ జరిపిస్తాం

సాగునీటిమంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి వెల్లడి.. నలుగురు మంత్రులతో కలిసి పరిశీలన

బరాజ్ స్థితిపై పవర్పాయింట్ ప్రజెంటేషన్

మేడిగడ్డ బరాజ్ వద్ద నమావేశంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు

వరంగల్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గత కాంగ్రెస్ హయాంలో చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు గోదావరి నీటిని అందించేందుకు వీలుగా తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం చేపడతామని నీటిపారుదలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్కుమార్రెడ్డి చెప్పారు. తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీతో ఎల్లంపల్లి బరాజ్లోకి నీటిని తరలిస్తామని, అక్కడి నుంచి ఇప్పుడున్న వ్యవస్థతో సాగునీటి సరఫరా చేస్తామని చెప్పారు. కాంగ్రెస్కి పేరు రావద్దనే ఉద్దేశంతో పాటు ఏదో మతలబుతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిందని ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ని నిర్మిస్తే తక్కువ ఖర్చుతో ప్రాజెక్టు లక్ష్యం నెరవేరేదని, అలా కాకుండా రూ.లక్ష కోట్లు ఖర్చుచేసి కాళేశ్వరం నిర్మించారని అన్నారు. కాళేశ్వరం కోసం గోదావరిలో మూడు బరాజ్లు నిర్మించారని, దీనికి బదులుగా తుమ్మిడిహట్టి వద్ద ఒక్కటి పూర్తిచేస్తే సరిపోయేదని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్లో పియర్ల కుంగుబాటుపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

పవర్పాయింట్ ప్రజెంటేషన్

మంత్రులు ఎన్ ఉత్తమ్కుమార్రెడ్డి దుద్దిళ్ల శ్రీధర్బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ టీ జీవన్రెడ్డి, ఎమ్మెల్యే జీ వివేక్ శుక్రవారం మేడిగడ్డ, అన్నారం బరాజ్లను సందర్శించారు. మేడిగడ్డ బరాజ్ వద్ద మంత్రుల సమక్షంలో సాగునీటి శాఖ ఉన్నతాధికారులు మీడియా ప్రతినిధులకు కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఉత్తమ్కుమార్రెడ్డి మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి వద్ద 148 మీటర్ల ఎత్తుతో బరాజ్కి మహారాష్ట్ర ప్రతిపాదించిందని చెప్పారు. 38 వేల కోట్లతో 16 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టును పక్కన పెట్టి లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపం జరిగిందని చెప్పారు. ఈ ప్రాజెక్టుపై డబ్బు మొత్తం వృథా అయ్యిందని, లోన్లకు వడ్డీలు పడుతున్నాయని చెప్పారు. మేడిగడ్డ బరాజ్, కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలన్నీ ప్రజలకు తెలియజేయాలనే తాము ఇక్కడికి వచ్చామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధానిని కోరామని, దీనికోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని చెప్పారు.

తెలుసుకోవడానికి వచ్చాం: మంత్రులు

మేడిగడ్డ బరాజ్లో పియర్లు కుంగిపోవడం, అన్నారం బరాజ్లో బుడగలు రావడంతో ఏం జరిగిందో తెలుసుకోవడానికి వచ్చామని పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు చెప్పారు. తమకు ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషం లేదని, ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, సాగునీటి మంత్రి ఇప్పటికే సమీక్షించారన్నారు. గ్రావిటీతో పూర్తయ్యే ప్రాజెక్టు బదులు నదిలో మూడు ప్రాజెక్టులు కట్టడం తుగ్లక్ చర్య అని ఆర్అండ్బీ మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణంలోపాలు గత ప్రభుత్వ తప్పిదమని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ప్రపంచంలో పెద్ద ప్రాజెక్టని చెప్పుకున్నారని, వాస్తవం చూస్తే ఉపయోగంలేని ప్రాజెక్టుగా మారిందని అన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో ఆతృత తప్ప ప్రజల ప్రయోజనం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రాజెక్టు కట్టేటప్పుడు ఆర్సీసీ కటాఫ్ వాల్ నిర్మించి ఉంటే ఇలాంటి ప్రమాదం జరిగేది కాదని చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ ఒక్క భారీ వరదకే పోయాయని, ఈ ముప్పునకు, ప్రభుత్వ అప్పులకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. బరాజ్ ప్రస్తుత పరిస్థితికి కారణమైన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. మూడో టీఎంసీ పనుల కోసం రూ.4 వేల కోట్ల పనులను అదే కంపెనీకి ఏ కారణంతో ఇచ్చారని ప్రశ్నించారు.

సర్పంచ్ను నిలబెట్టి.. కుర్చీల్లో మంత్రులు..!

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద శుక్రవారం జరిగిన మంత్రుల సమావేశంలో గ్రామ సర్పంచ్కు ప్రాధాన్యం కరువైంది. లక్ష్మీబరాజ్లో పిల్లర్ల కుంగుబాటుపై అధికారులు పవర్పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం కొనసాగుతున్నంత సేపు మంత్రులు, అధికారులు కుర్చీల్లో కూర్చోగా ఆ గ్రామ ప్రథమ పౌరుడు (సర్పంచ్) ఎర్రవెల్లి విలాస్రావు మాత్రం వెనుకవైపు నిల్చుని కనిపించారు. అలాగే వేదికపై ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఫొటో పెట్టకపోవడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్వి కట్టుకథలే

మొదటిపేజీ తరువాయి...

అని తేలిపోయిందని కడియం శ్రీహరి అన్నారు. మంత్రులు శుక్రవారం ఇచ్చిన పవర్పాయింట్ ప్రజెంటేషన్లో కాళేశ్వరంకు రూ.93 వేల కోట్లు ఖర్చయ్యిందని చెప్పారని, రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్చేశారు. ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 98 వేల ఎకరాల కొత్త ఆయకట్టు పెరిగిందని, 16 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగిందని పీపీటీలో ప్రభుత్వమే అంగీకరించిందని అన్నారు. వీటిని బట్టి కాంగ్రెస్ ఆరోపణలన్నీ అబద్ధమని తేలిపోయిందని పేర్కొన్నారు.

తుమ్మిడిహట్టికి కాంగ్రెస్ ప్రభుత్వాలేం చేశాయి?

తుమ్మిడిహట్టి దగ్గరే తాము ప్రాజెక్టును నిర్మిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి తప్పుడు మాట మాట్లాడారని కడియం విమర్శించారు. అదీ ఎత్తిపోతల ప్రాజెక్టేనని స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా కాదనే విషయాన్ని ఉత్తమ్ తెలుసుకుంటే మంచిందని సూచించారు. దానికి విద్యుత్తు అవసరం ఉంటుందని అన్నారు. 'తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మిస్తే 160 టీఎంసీల నీటి లభ్యత ఉండదని, ఆ ప్రాజెక్టు విజయవంతం కాదని కేంద్ర జలవనరుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి 2015లోనే లేఖ రాసింది. అన్నివైపుల నుంచి అసమ్మతులు ఉన్నా నాటి సీఎం వైఎస్సార్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నిజం కాదా? 2008 నుంచి 2014 వరకు ఉమ్మడి ఏపీ, మహారాష్ట్రతోపాటు కేంద్రంలోనూ కాంగ్రెసే అధికారంలో ఉన్నది. ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు కొంతమంది ఆనాడూ మంత్రులుగా ఉన్నారు. కనీసం కేంద్రజల సంఘం నుంచి అనుమతులు తెచ్చుకోలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా?' అని ప్రశ్నించారు.

ఈపీసీ తెచ్చిందెవరు?

నాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొత్తగా ఈపీసీ (ఎస్టిమేట్ ప్రొక్యూర్ అండ్ కన్స్ట్రక్షన్) విధానాన్ని తెచ్చి, దేశంలో ఎక్కడలేని విధంగా మొబిలైజేషన్ అడ్వాన్స్లు ఇచ్చిందని కడియం మండిపడ్డారు. ఉత్తర్వుల్లో 0.5 శాతం మొబిలైజేషన్ అడ్వాన్స్లు ఇస్తామని చెప్పి.. 2 నుంచి 2.5 శాతం ఇచ్చారని ధ్వజమెత్తారు. మొబిలైజేషన్ కోసమే దాదాపు రూ.651 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టిపై 6,116 కోట్లు ఖర్చుపెట్టినా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు ఇవ